క్లుప్తంగా

ఘనంగా పాలపోలమ్మ సంబరాలు



అమ్మవారిని ఊరేగిస్తున్న దృశ్యం

కంచిలి: అంపురం గ్రామంలో గ్రామదేవత పాలపోలమ్మ సంబర మహోత్సవాలు ఘనంగా జరుగుతున్నాయి. ఈ నెల 22వ తేదీ రాత్రి అమ్మవారి ఉత్సవాలు ప్రారంభించారు. ఇందులో భాగంగా శుక్రవారం కూడా అమ్మవారి ఉత్సవ విగ్రహాన్ని గ్రామ పురవీధుల్లో గోష్టిలు, మేళతాళాలతో ఊరేగించారు. అధికసంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

బోరుభద్రలో వైద్య శిబిరం



రోగులను పరీక్షిస్తున్న డాక్టర్ సంధ్యారాణి

సంతబొమ్మాళి: మండలంలో బోరుభద్ర గ్రామంలో ఫిజియోథెరపిస్ట్, సైకాలజిస్ట్ డాక్టర్ లఖినేని సంధ్యారాణి ఆధ్వర్యంలో ఉచిత వైద్య శిబిరాన్ని శుక్రవారం నిర్వహించారు. రోగులకు వివిధ వైద్య పరీక్షలు నిర్వహించి మందులను అందజేశారు. సుమారు వందమంది వైద్య పరీక్షలు చేయించుకున్నారు. అంతకుముందు వైద్య శిబిరాన్ని స్థానిక సర్పంచ్ లక్ష్మీకాంతం ప్రారంభించారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ నాయకులు సీహెచ్ చిన్నారావు, పి.పాపారావు పాల్గొన్నారు.

కళాకారుడుకి సత్కారం



ధనుంజయరెడ్డిని సత్కరిస్తున్న ట్రస్టు సభ్యులు

ఇచ్ఛాపురం రూరల్: ఉద్దానం జానపద కళాకారుడు, జాతీయ పురస్కారాల అవార్డు గ్రహీత తిప్పన ధనుంజయరెడ్డిని శ్రీకాకుళానికి చెందిన తరిణి ధార్మిక సేవ ట్రస్ట్ ఘనంగా సత్కరించింది. పద కవితా పితామహుడు తాళ్లపాక అన్నమయ్య 616వ జయంతి సందర్భంగా శుక్రవారం నిర్వహించిన ప్రత్యేక కార్యక్రమంలో ఆయనను దుశ్శాలువ, మెమెంటోతో సన్మానించి అభినందించారు. కార్యక్రమంలో ట్రస్ట్ ఎండీ, ఇండియన్ రెడ్ క్రాస్ జిల్లా చైర్మన్ పి.జగన్మోహనరావు, మండ శ్రీనివాస్, డాక్టర్ త్రినాథరావు, కె.దుర్గాప్రసాద్, డాక్టర్ ఎం.మోహనరావు పాల్గొన్నారు.

దివ్యాంగుడికి ఆర్థిక సాయం



కృష్ణారావుకు సాయాన్ని అందజేస్తున్న సభ్యులు

ఇచ్ఛాపురం రూరల్: రెండు కాళ్లను పోగొట్టుకొని ఆర్థికంగా ఇబ్బంది పడుతున్న ఓ దివ్యాంగుడికి ఆర్థిక సాయం చేసి పెద్ద మనస్సును చాటుకుంది సన్యాసిపుట్టుగకు చెందిన హెల్పింగ్ హ్యాండ్స్ ఆర్గనైజేషన్. స్థానిక పురుషోత్తపురం గ్రామానికి చెందిన గాలి కృష్ణారావు ఇటీవల జరిగిన ప్రమాదంలో తన రెండు కాళ్లను పోగొట్టుకున్నాడు. విషయం తెలుసుకున్న హెల్పింగ్ హ్యాండ్స్ క్లబ్ సభ్యులు రూ. ఎనిమిది వేలు సేకరించారు. ఈ మొత్తాన్ని బాధితుడికి శుక్రవారం అందజేశారు. కార్యక్రమంలో మాసుపత్రి త్యాగరాజు, నీలాపు బాలు, పనపాన పితంబర్, నీలాపు దాస్, నీలాపు తేజేస్, పద్మలు పాల్గొన్నారు.

విద్యాకానుకల స్టాక్ పాయింట్ పరిశీలన



స్టాక్‌పాయింట్‌ను పరిశీలిస్తున్న విజయకుమారి

ఇచ్ఛాపురం: ప్రభుత్వ పాఠశాలలో విద్యను అభ్యసిస్తున్న విద్యార్థులకు ప్రభుత్వం అందజేయనున్న విద్యాకానుకల స్టాక్‌పాయింట్‌లో భద్రతా ప్రమాణాలు పాటించాలని శ్రీకాకుళం డిప్యూటీ ఈవో ఆర్.విజయకుమారి సూచించారు. ప్రభుత్వోన్నత పాఠశాల ఆవరణలో ఏర్పాటు చేసిన స్టాక్‌పాయింట్‌ని శుక్రవారం పరిశీలించారు. జిల్లా కేంద్రాల నుంచి మండల కేంద్రాలకు వస్తున్న పాఠ్యపుస్తకాలు ఇచ్చిన లెక్కప్రకారం సక్రమంగా ఉన్నవి లేనివి సరి చూసుకోవాలని సూచించారు. ఎస్ఎస్ఏ సిబ్బంది ఉన్నారు.

లక్ష్యాలను చేరుకోవాలి

కాశీబుగ్గ: నిర్దేశిత లక్ష్యాలను చేరుకోవాలని సెర్ప్ ఏపీఎం గొడబ ప్రసాదరావు కోరారు. మందస పట్టణంలోని వైఎస్సార్ క్రాంతిపథం కార్యాలయంలో వీవోఏలతో శుక్రవారం సమీక్షా సమావేశం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. మొబైల్ బుకింగ్ కీపింగ్ టైం షెడ్యూల్ ప్రకారం అప్‌డేట్ చేయాలన్నారు. సీఐఎఫ్, స్త్రీనిధి, ఉన్నతి రికవరీలు నూటికి నూరుశాతం ఉండాలన్నారు. తక్కువ ప్రొగ్రెస్ ఉన్న వీఓఏలను వీఓ వారీగా ఉన్నతి రికవరీపై వివరించారు. ఎంఎస్ కోశాధికారి బాలక విజయశ్రీ, అకౌంటెంట్ కల్యాణి, సీసీలు, వీఓఏలు పాల్గొన్నారు.

ఖరీఫ్‌కు సన్నద్ధం!



మొదటి దశ దుక్కి దున్ని సిద్ధం చేసిన పొలాలు

- 69,390 ఎకరాల్లో సాగుకు సమాయత్తం
- 4,650 క్వింటాళ్ల సబ్సిడీ విత్తనాల సరఫరాకు ప్రణాళిక
- 110 క్వింటాళ్ల పచ్చిరొట్ట విత్తనాలు సరఫరా
- రైతు భరోసా కేంద్రాల ద్వారా విత్తనాల సరఫరాకు చర్యలు

టెక్కలి: ఈ ఏడాది ఖరీఫ్ సీజన్‌కు సంబంధించి టెక్కలి నియోజకవర్గంలో సాగు కోసం వ్యవసాయాధికారులు ప్రణాళిక సిద్ధం చేశారు. వాతావరణంలో చోటు చేసుకుంటున్న పరిస్థితులతో అడపా దడపా తేలికపాటి జల్లులు కురుస్తుండడంతో, రైతులు ఇప్పటికే మొదటి దశలో దుక్కిలు దున్ని పొలాలను సాగుకు సిద్ధం చేస్తున్నారు. ఈ ఏడాది నియోజకవర్గంలో సుమారు 69,390 ఎకరాల్లో సాగుకు రైతులు సిద్ధమవుతున్నట్లు వ్యవసాయాధికారులు అంచనా వేశారు. ఆయా రైతుల కోసం ప్రభుత్వం నుంచి సుమారు 4,650 క్వింటాళ్ల వరి, ఇతర విత్తనాలను సరఫరా చేసేందుకు ప్రణాళిక రూపొందించారు. వీటితో పాటు భూమిని సారవంతం చేసే వివిధ రకాల పచ్చిరొట్ట విత్తనాలను సుమారు 110 క్వింటాళ్లు అందజేసేందుకు ఉన్నతాధికారులకు నివేదించారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి రూపకల్పన చేసిన రైతు భరోసా కేంద్రాలు రైతులకు ఉపయోగకరంగా ఉండడంతో, ఈ ఏడాది సైతం ఆయా కేంద్రాల ద్వారా విత్తనాలు సరఫరా చేసేందుకు పూర్తి ఏర్పాట్లు చేశారు.

మండలాల వారీగా సాగు, విత్తనాల పంపిణీ లక్ష్యం		
మండలం	ఖరీఫ్ సాగు (ఎకరాల్లో)	విత్తనాలు పంపిణీ (క్వింటాళ్లలో)
టెక్కలి	17,830	1500
కోటబొమ్మాళి	17,000	900
నందిగాం	16,200	1200
సంతబొమ్మాళి	18,360	1050

విత్తనాల కోసం ప్రణాళిక

ఈ ఏడాది ఖరీఫ్ సీజన్‌లో నియోజకవర్గంలో సుమారు 69,390 ఎకరాల్లో సాగుకు సమాయత్తం అవుతున్నట్లు వ్యవసాయాధికారులు అంచనాలు వేశారు. ఆయా సాగుకు సంబంధించి మొదటి దశగా ఎంటీయూ 1061, బీపీటీ 5204, ఎంటీయూ 7029, ఎంటీయూ1224 తదితర రకాల వరి విత్తనాలు సుమారు 4,650 క్వింటాళ్లను సరఫరా చేసేందుకు ప్రణాళిక రూపొందించారు.

ప్రణాళిక సిద్ధం



ఈ ఏడాది ఖరీఫ్ సీజన్‌కు సంబంధించి వ్యవసాయ శాఖ పరంగా ప్రణాళిక సిద్ధం చేశాం. రైతులకు అవసరమైన వరి విత్తనాలు, పచ్చిరొట్ట విత్తనాలను రైతు భరోసా కేంద్రాల ద్వారా సరఫరా చేసేందుకు ఉన్నతాధికారులకు నివేదించాం. రైతులకు ఎక్కడా ఇబ్బందులు లేకుండా విత్తనాలు అందజేస్తాం.
– బి.వి.తిరుమలరావు, వ్యవసాయ ఏడీ, టెక్కలి

శాంతిభద్రతలకు విఘాతం కలిగిస్తే చర్యలు

- కాశీబుగ్గ రూరల్ సీఐ ఈశ్వరరావు



అవగాహన సదస్సులో సీఐ ఈశ్వరరావు, ఎస్సై రామారావు

వజ్రపుకొత్తూరు: శాంతి భద్రతలకు విఘాతం కలిగిస్తే కఠిన చర్యలు తప్పవని కాశీబుగ్గ రూరల్ సీఐ పి. ఈశ్వరరావు అన్నారు. గురువారం రాత్రి మండలంలోని సమస్యాత్మక గ్రామం పెద్దమురహరిపురంలో గ్రామస్తులతో శాంతిభద్రతలపై అవగాహన సమావేశం నిర్వహించారు. ముందుగా ఎన్నికలు సజావుగా సాగేందుకు సహకరించిన ప్రతి ఒక్కరికీ ధన్యవాదాలు తెలియజేశారు. ఎన్నికల అనంతరం ఓట్ల లెక్కింపు వరకు ప్రతీ ఒక్కరూ అన్నదమ్ముల్లా మెలగాలని సూచించారు. ర్యాలీలు, ఊరేగింపులు, టపాసులు పేల్చడం ఎన్నికల ఫలితాలు అనంతరం కూడా నిషేధమని దీనిని ప్రతీ ఒక్కరూ గుర్తు పెట్టుకోవాలన్నారు. కేసు నమోదైతే యువత తీవ్రంగా నష్టపోతారని వివరించారు. ప్రస్తుతం 144 సెక్షన్ అమల్లో ఉన్నందున గుంపులుగా ఉండవద్దన్నారు. ఎస్ఐ సీహెచ్ రామారావు, పోలీసు సిబ్బందిఉన్నారు.

వైఎస్సార్‌సీపీ విజయం తథ్యం



ఉదయ్‌కుమార్

వజ్రపుకొత్తూరు రూరల్: సార్వత్రిక ఎన్నికల్లో వైఎస్సార్‌సీపీ విజయం తథ్యమని పార్టీ జిల్లా సాంస్కృతిక విభాగం అధ్యక్షుడు, మండల ప్రత్యేక అహ్వానితులు ఉప్పరపల్లి ఉదయ్‌కుమార్ అన్నారు. పల్లిసారథి గ్రామంలో ఆయన శుక్రవారం మాట్లాడారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఐదేళ్ల సంక్షేమ పాలనకు ఓటర్లు మరోసారి పట్టకట్టారన్నారు. ఈ శుభవార్త అధికారికంగా వచ్చే నెల నాలుగో తేదీన జరగనున్న ఓట్ల లెక్కింపు తరువాత వెలువడనుందని ధీమా వ్యక్తం చేశారు. ప్రధానంగా మహిళల ఓటు శాతం పెరగడమే వైఎస్సార్‌సీపీ గెలుపునకు నాంది అన్నారు. అయితే ఓటర్లకు పెద్ద ఎత్తున మద్యం, తాయిళాలతో ప్రలోభాలకు గురి చేసిన కుటమీ అభ్యర్థులు తమదే గెలుపని పగటి కలలు కంటున్నారని ఎద్దేవా చేశారు. పలాస ఎమ్మెల్యేగా డాక్టర్ సీదిరి అప్పలరాజు అధిక మెజార్టీతో గెలిపొందడం ఖాయమన్నారు.

తల్లిదండ్రుల చేతికి విద్యార్థుల ప్రగతి పత్రాలు

కంచిలి: రాష్ట్ర పాఠశాల విద్యాశాఖ సరికొత్త పద్ధతిలో తల్లిదండ్రుల చేతికి నేరుగా విద్యార్థుల ప్రగతి పత్రాలు ఇచ్చే ఏర్పాట్లను చేపట్టిందని మండల విద్యాశాఖాధికారి ఎస్.శివరాంప్రసాద్ శుక్రవారం తెలిపారు. విద్యార్థులు ప్రోగ్రెస్ రిపోర్టును తల్లిదండ్రుల సెల్‌ఫోన్‌కు ఎస్.ఎం.ఎస్. రూపంలో సమాచారం ఇస్తుందని తెలిపారు. ఎస్.ఎం.ఎస్.తోపాటు స్కూల్ ఇన్ఫర్మేషన్ సిస్టం సైట్ లింక్ చేరవేయడం, ఓటీపీ ఆధారిత సురక్షితమైన పద్ధతిలో సమాచారాన్ని బట్వాడా చేస్తున్నారని, దీన్ని తల్లిదండ్రులు గమనించాలని ఎంఈఓ కోరారు.

ఇంటర్ సప్లిమెంటరీ పరీక్షలు ప్రారంభం

కోటబొమ్మాళి: స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాల కేంద్రంగా ఇంటర్ సప్లిమెంటరీ పరీక్షలు శుక్రవారం ప్రారంభమయ్యాయి. తెలుగు, సంస్కృతం సబ్జెక్టులను పిల్లలు రాశారు. ఉదయం జరిగిన ఫస్టియర్ పరీక్షలకు 45 మంది, మధ్యాహ్నం జరిగిన సెకెండియర్ పరీక్షలకు 18 మంది విద్యార్థులు హాజరయ్యారని ప్రిన్సిపాల్ సంతోషిని తెలిపారు. పరీక్ష కేంద్రాన్ని జిల్లా విద్యాశాఖాధికారి కె.ప్రకాశరావు సందర్శించారు.

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

కాశీబుగ్గ: కాశీబుగ్గ పట్టణ పరిధిలో శనివారం ఉదయం 10.30 నుంచి సాయంత్రం ఐదు గంటల వరకు విద్యుత్‌ను నిలిపివేస్తున్నట్లు పలాస ఈఆర్ఓ కార్యాలయం శుక్రవారం ఓ ప్రకటనలో తెలిపింది. గాంధీనగర్ 11 కేవీ పరిధిలో మరమ్మతులు చేపడుతున్నందున కాశీబుగ్గ కేటీ రోడ్డు హరీశంకర్ నుంచి బీఎస్ఎన్ఎల్ ఆఫీస్ వరకు, శ్రీనివాస లాడ్జి నుంచి డాక్టర్ మల్లేశ్వరావు ఆస్పత్రి రోడ్డు తిలక్‌నగర్, ఎస్ఎండీ పార్లర్, న్యూకాలనీ, పల్లివీధి, హరిజన వీధి, డెంకి వీధి, కాశీగుండాం, శరదానగర్, ఆర్‌కే పోలీస్ కాలనీ, మహారాణి పేట, ఆంధ్ర బ్యాంక్ రోడ్డు, గున్నెశ్వరనగర్, చేపల మార్కెట్, పోలీస్ స్టేషన్ తదితర ప్రాంతాలకు సరఫరా ఉండదని.. వినియోగదారులు గమనించి సహకరించాలని కోరారు.

టెన్త్ సప్లమెంటరీ పరీక్షలకు 36 మంది గైర్హాజరు

ఇచ్ఛాపురం: పదవ తరగతి సప్లమెంటరీ పరీక్షలకు 36 మంది విద్యార్థులు గైర్హాజరైనట్లు డిపార్టుమెంటల్ అధికారి విశ్వనాథం తెలిపారు. స్థానిక ప్రభుత్వోన్నత పాఠశాల కేంద్రంగా పరీక్షలు శుక్రవారం ప్రారంభమయ్యాయి. 87 మంది పరీక్షకు హాజరు కావాల్సి ఉండగా 51 మంది హాజరయ్యారు. పరీక్షలకు నెయ్యిల విశ్వనాథం సీఎస్‌గా వ్యవహరించారు.

బస్ షెల్టర్ నిర్మాణానికి విజ్ఞప్తి



బస్ షెల్టర్ నిర్మాణం చేయాల్సిన జంక్షన్

టెక్కలి: డివిజన్ కేంద్రమైన టెక్కలికి ప్రధాన రైల్వే మార్గానికి అనుకూలంగా ఉన్న నౌపడ ఆర్ఎస్ జంక్షన్ వద్ద బస్ షెల్టర్ నిర్మాణం చేయాలని ప్రయాణికులు, ఆ ప్రాంతవాసులు కోరుతున్నారు. రైల్వే గేటుకు ఆనుకుని జంక్షన్ వద్ద నిత్యం ఎంతో మంది ప్రయాణికులు రాకపోకలు సాగిస్తుంటారు. అయితే ఇదే జంక్షన్ వద్ద కనీస సదుపాయమైన బస్ షెల్టర్ లేకపోవడంతో వారంతా ఇబ్బందులు పడుతున్నారు. ముఖ్యంగా ఎండ, వర్షం పడే సమయంలో ప్రయాణికులు పడుతున్న అవస్థలు వర్ణనాతీతం. ఒక వైపు నౌపడ రైల్వే స్టేషన్‌కు వెళ్లే మార్గం, మరో వైపు నౌపడ-పూండి మార్గం కావడంతో, ఈ ప్రాంతంలో బస్ షెల్టర్ నిర్మాణం ఎంతో అవసరం. ఇప్పటికైనా అధికార యంత్రాంగం స్పందించి బస్ షెల్టర్ నిర్మాణం చేయాలని కోరుతున్నారు.

ఆర్థిక క్రమశిక్షణతోనే సత్ఫలితాలు



శిక్షణ ఇస్తున్న ఏపీఎం గోవింద్

కవిటి: మండల మహిళాసమాఖ్యలో సభ్యులుగా ఉన్న మహిళలంతా ఆర్థిక క్రమశిక్షణ సక్రమంగా పాటించడం ద్వారా సత్ఫలితాలను సాధించగలరని స్త్రీనిధి జిల్లా మేనేజర్ రాము, ఏపీఎం కె.గోవింద్ అన్నారు. కవిటి మండల మహిళాసమాఖ్య భవనంలో రెండురోజుల ఫైనాన్సియల్ మేనేజ్‌మెంట్ అంశంపై జరిగిన శిక్షణ శుక్రవారంతో ముగిసింది. ఈ సందర్భంగా మండలంలోని 53 మహిళా గ్రామైక్యసంఘాల ప్రతినిధులకు శిక్షణ ఇచ్చారు. అన్ని గ్రామ సంఘాల తాలూకు వీఓఏలకు అన్ని ఆర్థిక లావాదేవీలపై శిక్షణ ఇచ్చారు. సామాజిక పెట్టుబడినిధి, స్త్రీనిధి, ఉన్నతి పథకాల ద్వారా తీసుకున్న రుణాల రికవరీ తక్కువ ఉన్న గ్రామ సంఘాల వారు శతశాతం రికవరీ చేయాలన్నారు.

దివ్యాంగ పిల్లల గుర్తింపునకు సర్వే



దివ్యాంగ విద్యార్థి వివరాలు నమోదు చేస్తున్న ఎంఈవోలు

కాశీబుగ్గ: దివ్యాంగ పిల్లలను బడిలో చేర్పించడానికి వీరిని వారి గుర్తింపు కోసం జూన్ తొమ్మిదో తేదీ వరకు స్పెషల్ డ్రైవ్ నిర్వహిస్తున్నట్లు పలాస ఎంఈవో1,2లు సీహెచ్ సత్యం, సీహెచ్ శ్రీనివాసరావు శుక్రవారం తెలిపారు. పలాస-కాశీబుగ్గ మున్సిపాలిటీ, పలాస మండల పరిధిలో ఉన్నటువంటి గ్రామాలలో, వార్డులలో ఇంటింటికీ వెళ్లి దివ్యాంగు పిల్లల కోసం సర్వే చేస్తున్నట్టు పేర్కొన్నారు. పాఠశాలలో చేరేందుకు పేర్లు నమోదు చేసుకోవాలని సూచించారు. మూడు నుంచి 18 ఏళ్ల దివ్యాంగులకు అవసరమైన వీల్‌చైర్‌లు, రాలేటర్, ట్రైసైకిల్, వినికిడి యంత్రాలు, ఫిజియోథెరపీ, స్పీచ్ థెరపీ, బిహేవియర్ థెరపి వంటి సేవలు పాఠశాలల్లో అందుబాటులో ఉన్నాయని అన్నారు. స్పెషల్ డ్రైవ్‌లో స్పెషల్ ఎడ్యుకేటర్ బగాది రవిశ్రీనివాస్, ఎస్.ఆనందరావు ఉన్నారు.

ఉదయపురంలో పోలీసుల కార్డన్ సెర్చ్



సోదాలు చేస్తున్న పోలీసు సిబ్బంది

కాశీబుగ్గ: ఇటీవల జరిగిన ఎన్నికలో పోలైన ఓట్ల లెక్కింపునకు సమయం సమీపిస్తోంది. దీంతో గ్రామాలు, పట్టణాల్లో ఎటువంటి అవాంఛనీయ సంఘటనలకు తావు లేకుండా పోలీసులు చర్యలు చేపడుతున్నారు. అందులో భాగంగా కాశీబుగ్గ డీఎస్పీ నాగేశ్వరరెడ్డి ఆదేశాల మేరకు మున్సిపాలిటీ పరిధి ఉదయపురం గ్రామంలో శుక్రవారం పోలీసులు కార్డన్ సెర్చ్ నిర్వహించారు. ఇంటింటికీ వెళ్లి అనుమానితుల గురించి ఆరా తీశారు. నాటుసారా, మద్యం, గంజాయి ఉండేమోనని సోదాలు చేపట్టారు. ఎస్సై పారినాయుడు, క్రైం హెచ్‌సీ శ్రీనివాసరావు ఉన్నారు.

పలాసలో తేలికపాటి వర్షం

కాశీబుగ్గ: బంగాళాఖాతంలో ఏర్పడిన అల్పపీడనం ప్రభావంతో పలాస మండలంలో శుక్రవారం తేలికపాటి వర్షం కురిసింది. మధ్యాహ్నం వరకూ ఎండతో ఇబ్బందిపడిన జనం.. ఈ వర్షంతోపాటు చల్లని గాలులతో ఉపశమనం పొందారు.

చెలమ నీరు వద్దు.. మంచినీరే ముద్దు

- డొంకూరులో నీటి వినియోగంపై అవగాహన



ప్రజలకు అవగాహన కల్పిస్తున్న ఏఈఈ విష్ణుమూర్తి



రక్షిత మంచినీటిపై ప్రతిజ్ఞ చేస్తున్న అధికారులు

ఇచ్ఛాపురం రూరల్: సముద్ర తీరంలో చెలమల ద్వారా లభించే నీటిని తాగునీరుగా ఉపయోగించకుండా పైపుల ద్వారా ప్రభుత్వం అందజేస్తున్న మంచి నీటిని మాత్రమే తీసుకోవాలని ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈఈ కూన విష్ణుమూర్తి అన్నారు. జల్‌జీవన్ మిషన్ ఆధ్వర్యంలో శుక్రవారం డొంకూరు మత్స్యకార గ్రామంలో స్థానిక ప్రజలకు 'చెలమ నీరు వద్దు...మంచినీరే ముద్దు' అనే అంశంపై గ్రామ సభ ద్వారా అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఇప్పటికే గ్రామానికి సంబంధించి జల్ జీవన్ మిషన్ ద్వారా మొదటి విడతలో 400 కుళాయిల ద్వారా ఇంటింటికి మంచినీటిని అందజేస్తున్నామన్నారు. అలాగే 90 వేల లీటర్ల సామర్థ్యం ఉన్న ఓవర్ హెడ్ ట్యాంకు ద్వారా గ్రామానికి రక్షిత మంచినీటిని సరఫరా చేస్తున్నామని వివరించారు. గ్రామంలో ఇప్పటికే ఉన్న తొమ్మిది మంచినీటి బోర్లను సద్వినియోగపరచుకోవాలని సూచించారు. తరతరాల నుంచి తామంతా చెలమల ద్వారా లభించే నీటినే తాగునీరుగా వినియోగించుకుంటున్నామని, అదే నీరు అలవాటు కావడంతో పైపుల ద్వారా వచ్చే నీటిని తాగునీరుగా వినియోగించుకోలేకపోతున్నామని స్థానికులు కొంత మంది అధికారుల ఎదుట తమ సందేహాన్ని వెల్లబుచ్చారు. చెలమల నీరు శ్రేయస్కరం కాదని, పైపుల ద్వారా అందించే రక్షిత మంచినీటినే వాడాలని అధికారులు స్పష్టం చేశారు. జలజీవన్ మిషన్ రెండవ విడత ద్వారా పూర్తి స్థాయిలో ఇంటింటికీ కుళాయిలు వేసి మంచినీటిని అందిస్తామని జలజీవన్ మిషన్ జిల్లా మానిటరింగ్ టీమ్ సభ్యులు వెల్లడించారు. రక్షిత మంచినీరు ద్వారా కలిగే లాభాలను ప్రతిజ్ఞ ద్వారా స్థానికులకు తెలిపారు. సమావేశంలో సర్పంచ్ బుద్ధ కల్యాణ్, ఎంపీడీవో వైవీ రాజేంద్రప్రసాద్, ఈవోపీఆర్డీ సత్యన్నారాయణ, పంచాయతీ కార్యదర్శి కృష్ణ, ఇంజినీరింగ్ అసిస్టెంట్ సల్ల ప్రవీణ్, ఎంసీఓ పైలా లింగమ్మ, మానిటరింగ్ టీమ్ సభ్యులు కె.అమ్మోజీరావు, ఎస్.మురళీమోహన్, డి.దాలినాయుడు ఉన్నారు.

రుద్రమూర్తికి కళా సేవా పురస్కారం



రుద్రమూర్తిని సత్కరిస్తున్న దృశ్యం

పలాస: ఉద్దానం సాహితీ సాంస్కృతిక వేదిక అధ్యక్షుడు, వెండి తెర కళాకారుడు, రచయిత, దర్శకుడు లండ రుద్రమూర్తికి విశిష్ట కళా సేవా పురస్కారం లభించింది. తాడేపల్లిగూడెంలోని బి.వి.ఆర్ కళాకేంద్రంలో ఈనెల 18 నుంచి 24 తేదీ వరకు జరిగిన జాతీయ స్థాయి నాటిక పోటీలు సందర్భంగా నిర్వాహకులు ఈ పురస్కారాన్ని అందజేసి ఘనంగా సత్కరించారు. ఇతను భిలాయిలో పనిచేసి ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు కూడా అందుకున్నారు. భిలాయి నటసమాఖ్య అధ్యక్షునిగా కూడా సేవలు అందించారు. భిలాయి ద్విభాషా సాహిత్య పత్రికకు ఎడిటర్‌గా ఉన్నారు. ఆంధ్రప్రదేశ్ నాటక పరిషత్తుల కమిటీ అధ్యక్షుడు బొద్దాల వెంకట రామారావు చేతుల మీదుగా ఈ పురస్కారాన్ని రుద్రమూర్తి అందుకున్నారు. ప్రవాసాంధ్ర ప్రజా నాట్యమండలి సీనియర్ ఉపాధ్యక్షుడు కొండప్ప వెంకటరావు, ప్రధానకార్యదర్శి సి.హెచ్.శ్రీనివాసరావు, కె.హరి, ధర్మారావు, ఎం.బాబూరావు, శివకుమార్, భాస్కరరావు తదితరులు హర్షం వ్యక్తం చేశారు.

ఓట్ల లెక్కింపుపై అవగాహన అవసరం

- ఇచ్ఛాపురం నియోజకవర్గ ఆర్వో సుదర్శనదొర



ఇచ్ఛాపురం రూరల్: సిబ్బందితో మాట్లాడుతున్న ఆర్వో సుదర్శన్ దొర

ఇచ్ఛాపురం రూరల్: సార్వత్రిక ఎన్నికల ఓట్ల లెక్కింపు ప్రక్రియ ప్రశాంతంగా, సజావుగా జరిగేందుకు అధికారులకు అవగాహన అవసరమని ఇచ్ఛాపురం నియోజకవర్గ ఎన్నికల రిటర్నింగ్ అధికారి బి.సుదర్శనదొర అన్నారు. స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో నియోజకవర్గంలోని అన్ని మండలాల రెవెన్యూ, మండల పరిషత్, మున్సిపాలిటీ సిబ్బందితో శుక్రవారం నిర్వహించిన సమావేశంలో మాట్లాడారు. జూన్ నాలుగో తేదీ ఉదయం ఎనిమిది గంటలకు పోస్టల్ బ్యాలెట్‌తో కౌంటింగ్ ప్రక్రియ ప్రారంభమవుతోందన్నారు. ఈ నేపథ్యంలో ఎలక్షన్ కమిషన్ కౌంటింగ్ ప్రక్రియపై జారీ చేసిన మార్గదర్శకాలను చదివి వినిపించారు. వీటిని తూచా తప్పకుండా పాటించాలని అన్నారు. సమావేశంలో ఎన్నికల ఉప తహసీల్దార్ బలివాడ శ్రీహరి, ఇచ్ఛాపురం, కవిటి, కంచిలి, సోంపేట తహసీల్దార్లు ఎం.బి.అప్పారావు, కె.లక్ష్మి, ఎం.వి.కె.ఎస్.వెంకటరావు, విజయ్‌కుమార్, ఎంపీడీవోలు వై.వి.రాజేంద్రప్రసాద్, శ్రీనివాసరెడ్డి, వి.నీరజ, కె.రామారావు, మున్సిపల్ కమిషనర్ ఎస్.రమేష్, ఉప తహసీల్దార్లు పాల్గొన్నారు.

ఘనంగా అసిరిపోలమ్మ పండుగలు



అమ్మవారిని ఊరేగిస్తున్న దృశ్యం



తల్లిదండ్రుల్ని కావడిలో మోసుకెళుతున్న శ్రావణకుమారుని విగ్రహం



కోయిడ్యాన్స్ బృందం నృత్య ప్రదర్శన

కవిటి: మండలంలోని నెలవంక గ్రామదేవత అసిరిపోలమ్మ అమ్మవారి నవరాత్రి పండుగలు వైభవంగా జరుగుతున్నాయి. శుక్రవారం అమ్మవారిని గ్రామవీధుల్లో ఘనంగా ఊరేగించారు. ఈ సందర్భంగా మహిళలు ఘటాలను తలమీద పట్టుకుని అమ్మవారి వెనుక ఊరేగింపుయాత్రలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన రథాలు, వీధినాటకాలు చూపరుల్ని అలరిస్తున్నాయి.

మండలానికి చేరుకున్న పాఠ్యపుస్తకాలు



కవిటిలో భద్రపరిచిన పాఠ్యపుస్తకాలు

కవిటి: వేసవి సెలవులు అనంతరం జూన్ 12వ తేదీన పాఠశాలలు పునఃప్రారంభం రోజునే విద్యార్థులకు పాఠ్యపుస్తకాలను అందజేయాలని విద్యాశాఖాధికారులు చూస్తున్నారు. దీంతో పాఠ్యపుస్తకాలను మండల కేంద్రాలకు తరలించే ప్రక్రియ ప్రారంభమైంది. ఒకటి నుంచి పదో తరగతి వరకు కవిటి మండలానికి ఇంగ్లిష్, ఒడియా, తెలుగు మీడియాలకు సంబంధించి ప్రభుత్వ పాఠశాలల్లోని 8,248 మందికి 70,729 పుస్తకాలు అవసరమని మండలవిద్యాశాఖ వర్గాలు ఉన్నతాధికారులకు నివేదించాయి. ఈమేరకు మొదటి విడతగా మండలానికి ఆర్టీసీ కార్గో సర్వీసెస్ బస్సుల్లో 18,530 పుస్తకాలను చేర్చినట్టు సంబంధిత అధికారులు తెలిపారు. ఈ నెలాఖరునాటికి మరికొన్ని పుస్తకాలు వస్తాయని చెప్పారు. అలాగే విద్యా కానుకలో భాగంగా స్కూల్‌బ్యాగులు, బూట్లు కూడా అందించేందుకు చర్యలు ప్రారంభించారన్నారు.